RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 170 | జులై 21 మంగళవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 170 | July 21 Tuesday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


**క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం: రూ.5 లక్షల సబ్సిడీతో పాటు స్థలం.. మంత్రుల వెల్లడి**

2

## పార్లమెంట్ సమావేశాలు

# సజావుగా సాగాలి

**మీడియా సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ**




**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**
పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా, అత్యంత నిర్మాణాత్మకంగా సాగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆకాంక్షించారు. సోమవారం పార్లమెంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశం ప్రస్తుతం వివిధ రంగాలలో సాధిస్తున్న విజయాలను ప్రస్తావించారు. దేశ ప్రగతికి వర్షాకాలం ఎంత ముఖ్యమో, పార్లమెంట్ సమావేశాలు కూడా అంతే కీలకమని, ఉభయ సభల్లోనూ అర్థవంతమైన చర్చలు జరగాలని కోరారు. గత కొన్ని రోజులుగా దేశంలో ఎన్నో సానుకూల పరిణామాలు చోటుచేసుకున్నాయని, ముఖ్యంగా అంతరిక్ష రంగంలో సరికొత్త శకం ప్రారంభమైందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. దేశీయ స్టార్టప్ కంపెనీ 'స్కైరూట్' రూపొందించిన 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సగటున 28 ఏళ్ల వయసున్న యువ శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు ఈ అద్భుత ఘనత సాధించడం యాదృచ్ఛికం కాదని, భారత యువతకు ఉన్న అపరిమితమైన నైపుణ్యానికి, ఆకాంక్షలకు ఇది నిదర్శనమని ప్రధాని కొనియాడారు. గతంలో భారత పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకోగా, ఇప్పుడు ఒక ప్రైవేట్ స్టార్టప్ అంతరిక్షంలో దేశ జెండాను ఎగురవేయడం గర్వకారణమన్నారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు సంస్థల ప్రయోగాలు విజయవంతమయ్యాయని గుర్తుచేస్తూ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి పరోక్షంగా చురకలు అంటించారు. అంతరిక్ష రంగంలోనే కాకుండా పారిశ్రామిక, మౌలిక సదుపాయాల కల్పనలోనూ దేశం వేగంగా దూసుకుపోతోందని ప్రధాని మోడీ వివరించారు. ఇటీవల రాజస్థాన్‌లో

➤ మిగతా 2వ పేజిలో..

# ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తత

**'చలో పార్లమెంట్' ముట్టడి..**
**నిరసనకారులపై పోలీసుల లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం**



**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**
దేశ రాజధానిలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో పార్లమెంట్' మార్చ్ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. నీట్-యూజీ పరీక్షల్లో జరిగిన అక్రమాలను నిరసిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు, పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ఈ నిరసన చేపట్టడంతో పోలీసులు ముందుగానే భద్రతను కట్టుదిట్టం చేసి ర్యాలీకి అనుమతి నిరాకరించారు. అయినప్పటికీ, ఉత్సాహంతో ఊగిపోయిన

➤ మిగతా 2వ పేజిలో..

# అంజనాపురంలో గోద్రెజ్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

**పామాయిల్ సాగు రైతులకు లాభసాటి..**
**డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల**



**ఖమ్మం జనసంఘర్షణ**
తెలంగాణలో పామాయిల్ గెలల ధరల పెంపునకు మరియు రైతాంగ సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సోమవారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన అత్యాధునిక 'గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ'ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, అనివార్య కారణాల వల్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయారని, అయితే జిల్లా రైతాంగానికి సీఎం తన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా భవిష్యత్తులో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రధాన వేదికగా మారబోతోందని, అందులో భాగంగానే గోద్రెజ్ సంస్థ ఇక్కడ

➤ మిగతా 2వ పేజిలో..

## ఆగస్టు 1న ప్రధాని మోడీ చేతుల మీదుగా భోగాపురం

# అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం



**విజయనగరం జనసంఘర్షణ :**
ఉత్తరాంధ్ర ప్రగతికి మణిహారంగా నిలవనున్న భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. వచ్చే ఆగస్టు 1వ తేదీన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను హోం మంత్రి అనిత, ఐటీ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడిన హోం మంత్రి, ప్రధాని పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్, భద్రతా ప్రమాణాలపై అధికారులకు కీలక సూచనలు చేస్తూ, ఉత్తరాంధ్ర సంస్కృతిని ప్రతిబింబించేలా జానపద కళారూపాలతో ప్రధానికి ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఒకప్పుడు సాధారణ గ్రామంగా ఉన్న భోగాపురం, నేడు అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణంతో సరికొత్త రూపురేఖలను సంతరించుకుందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర

➤ మిగతా 2వ పేజిలో..

# నేడు, రేపు బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

**భక్తుల రద్దీ దృష్ట్యా నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు**

**హైదరాబాద్ జనసంఘర్షణ :**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ఎంతో వైభవంగా సాగుతున్న వేళ, హైదరాబాద్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవం, రథోత్సవాలకు సర్వం సిద్ధమైంది. మంగళవారం, బుధవారం రోజుల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఈ వేడుకలకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు భారీగా తరలిరానున్నారు. భక్తుల రాకతో బల్కంపేట పరిసర ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయే అవకాశం ఉన్నందున,

➤ మిగతా 2వ పేజిలో..

# అంజనాపురంలో గోడ్రెజ్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి...** ఆయిల్ పామ్ కాంప్లెక్స్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ ప్రాజెక్టు సాధన కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న మంత్రి తుమ్మలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 25 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ అవసరం ఉండగా, కేవలం 12 లక్షల మిలియన్ టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోందని, ఈ భారీ కొరతను భర్తీ చేయడంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. 1992లో ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైన పామాయిల్ సాగు నేడు తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిందని, గతంలో టన్ను ధర రూ.12,000 ఉండగా, నేడు అది రూ.23,000లకు పెరగడం రైతుల ఆర్థిక వృద్ధికి నిదర్శనమని డిప్యూటీ సీఎం భట్టి పేర్కొన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, అంజనాపురం గోడ్రెజ్ ఫ్యాక్టరీలో అత్యాధునిక సీడ్ గార్డెన్‌ను కూడా అందుబాటులోకి తెచ్చామని, కంపెనీ రైతులకు నిరంతరం నాణ్యమైన సేవలను అందించాలని ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును విస్తరించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇప్పటికే మూడు ఫ్యాక్టరీల నిర్మాణం పూర్తి కాగా, మరో ఆరు ఫ్యాక్టరీలు శరవేగంగా సిద్ధమవుతున్నాయని వెల్లడించారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ పరిశ్రమలను నెలకొల్పడమే తన ధ్యేయమన్నారు. తన యాభై ఏళ్ల సుదీర్ఘ వ్యవసాయ అనుభవంలో ఎన్నో రకాల పంటలు పండించినప్పటికీ, ఆయిల్ పామ్ ఇచ్చినంత స్థిరమైన, భారీ ఆదాయాన్ని ఏ పంటా ఇవ్వలేదని, ప్రకృతి విపత్తులను సైతం తట్టుకుని నిలబడే ఏకైక పంట ఇదని మంత్రి తుమ్మల స్వయంగా స్పష్టం చేశారు. దివంగత నేత ఎన్టీఆర్ ఈ పంటను ప్రవేశపెట్టిన నాటి నుంచి తాను కూడా దీనిని సాగు చేస్తున్నట్లు గుర్తుచేశారు. పామాయిల్ రైతులకు మరింత మేలు జరిగేలా కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాలను సవరించి సహకరించాలని దక్షిణ భారతదేశ నేతలమంతా విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న ఎల్‌నినో ప్రభావం వల్ల రుతుపవనాలు సకాలంలో రావడం లేదని, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్న తరుణంలో భూములను చల్లబరిచేందుకు ఉద్యానవన పంటల సాగు ఎంతో అవసరమని పేర్కొంటూ, రైతులంతా ఉత్సాహంగా ఆయిల్ పామ్ సాగు వైపు అడుగులు వేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

## పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగాలి

**మొదటిపేజీ తరువాయి...** దేశంలోనే అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని ప్రారంభించడంతో పాటు, సెమీ కండక్టర్ ప్లాంట్‌ను, గ్రీన్ హైడ్రోజన్ రైలును దేశానికి అంకితం చేసినట్లు వెల్లడించారు. అంతర్జాతీయంగా ఎదురవుతున్న యుద్ధ వాతావరణం, తద్వారా పెరుగుతున్న చమురు ధరల సంక్షోభం వంటి సవాళ్లను అధిగమిస్తూ, భారతదేశం ప్రస్తుతం 7.7 శాతం వృద్ధి రేటును నమోదు చేయడం విశేషమని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నా, భారత్ మాత్రం స్థిరమైన పురోగతిని సాధిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. దేశ సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రజాప్రతినిధులందరూ సభలో గందరగోళానికి తావులేకుండా దేశ ప్రయోజనాలపై చర్చించాలని ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు.

## నత్తనడకన సర్ డిజిటైలేషన్

### కేవలం 65 శాతం మాత్రమే పూర్తయినట్లు సమాచారం

**హైదరాబాద్, జూలై20 :** రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియకు సంబంధించిన డిజిటలైజేషన్ నత్తనడకన సాగుతున్నది. మరోవైపు అధికారులేమో 90 శాతం పూర్తయిందంటూ ప్రకటనలు ఇస్తున్నారు. బిఎల్‌వోలు తమ ఇంటికి రాలేదని, తమకు ఫారాలు ఇవ్వలేదని పలుచోట్ల నుంచి వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. ఇకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారమ్ ల పంపిణీ దాదాపు పూర్తయినప్పటికీ వాటికి సంబంధించిన ఆన్‌లైన్ డాటా ఎంట్రీ పక్రియ మందకొడిగా నడుస్తున్నది. ఆదివారం సాయంత్రం వరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) కార్యాలయానికి అందిన గణాంకాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా 2,19,23, 435 ఈఎఫ్‌ల 64.81 శాతం డిజిటలైజేషన్ పూర్తయింది. గ్రామీణ జిల్లాలతో పోలిస్తే ఎకువ ఓటర్లున్న నగర, ఐటీ కారిడార్ పరిధిలోని జిల్లాల్లో ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ మెల్లగా సాగుతున్నది. మేడ్చల్ మలాజిగిరి జిల్లాలో అత్యంత తకువగా 37.30శాతం ఈఎఫ్‌లు మాత్రమే డిజిటలైజ్ కాగా, హైదరాబాద్ జిల్లాలో 39.59శాతం , రంగారెడ్డి జిల్లాలో 48.52శాతం ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ పూర్తయింది. వీటితో పోలిస్తే గ్రామీణ జిల్లాలు చాలా ముందంజలో ఉన్నాయి. ఇప్పటివరకు 88.43? ఈఎఫ్‌ల డిజిటలైజేషన్‌తో యాదాద్రి భువనగిరి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో

సిద్దిపేట (83.55శాతం), నల్లగొండ (82.74శాతం), కుమ్రంభీం ఆసిఫాబాద్ (81.63శాతం) జిల్లాలు ఉన్నాయి.

# నేడు, రేపు బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

**మొదటిపేజీ తరువాయి...** శాంతిభద్రతలకు మరియు ప్రజా రవాణాకు ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల నేపథ్యంలో బల్కంపేట పరిసరాల్లో వాహనాల రాకపోకలపై ప్రత్యేక ఆంక్షలు విధిస్తూ ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ అధికారికంగా వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం గ్రీన్‌ల్యాండ్స్, సత్యం థియేటర్ వైపు నుంచి బల్కంపేట మీదుగా ఫతేనగర్ వైపు వెళ్లే వాహనదారులను ఎస్‌ఆర్ నగర్ టీ జంక్షన్, బీకే గూడ మీదుగా సనత్‌నగర్ వైపునకు మళ్లించనున్నారు. అదేవిధంగా ఫతేనగర్ ఫ్లై ఓవర్ మీదుగా బల్కంపేట వైపు వచ్చే వాహనాలకు అనుమతి నిరాకరిస్తూ, వాటిని కట్టమైసమ్మ గుడి మరియు బేగంపేట వైపునకు పంపించనున్నారు. గ్రీన్‌ల్యాండ్స్ ఫుడ్ వరల్డ్ నుంచి బల్కంపేట వైపు వెళ్లే మార్గాన్ని పూర్తిగా 'నో ఎంట్రీ' జోన్‌గా ప్రకటించారు. బేగంపేట, కట్టమైసమ్మ ఆలయాల వైపు నుంచి బల్కంపేట వైపు వచ్చే వాహనాలను సత్యం థియేటర్, మైత్రీవనం మీదుగా మళ్లిస్తామని అధికారులు స్పష్టం చేశారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు వీలుగా ఎస్‌ఆర్ నగర్ టీ జంక్షన్ నుంచి ఫతేనగర్ వరకు ఉన్న అన్ని చిన్న సందులను, అంతర్గత రహదారులను తాత్కాలికంగా మూసివేయనున్నారు.

అమ్మవారి దర్శనార్థం సొంత వాహనాలలో వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు. వాహనాలను నిలిపేందుకు ఆర్ అండ్ బీ కార్యాలయం, జీహెచ్‌ఎంసీ గ్రౌండ్, నేచర్ క్యూర్ హాస్పిటల్ ప్రాంగణాలలో తగిన వసతులు కల్పించారు. ఉత్సవాలు జరిగే ఈ రెండు రోజుల పాటు బల్కంపేట వైపు ప్రయాణించే వాహనదారులు, సాధారణ ప్రజలు ఈ ట్రాఫిక్ మళ్లింపులను గమనించి, పోలీసులకు సహకరిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తత

వేలాది మంది నిరసనకారులు పోలీసుల ఆంక్షలను ధిక్కరించి, బారికేడ్లను తోసుకుంటూ పార్లమెంట్ భవనం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పార్లమెంట్‌కు కేవలం రెండు వందల మీటర్ల దూరంలో ఉన్న రైసినా రోడ్డు మార్గంలో ఆందోళనకారులను భద్రతా బలగాలు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం మరియు తోపులాట చోటుచేసుకుంది.

ఈ క్రమంలో ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, సంసద్ మార్గ్ ప్రాంతాలలో ఉద్రిక్త వాతావరణం మరింత పెరిగింది. సంసద్ మార్గ్ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బారికేడ్లను తొలగించి ముందుకు సాగేందుకు నిరసనకారులు ప్రయత్నించడంతో, వారిని చెదరగొట్టేందుకు పోలీసులు భాష్పవాయువు (టియర్ గ్యాస్) గోళాలను ప్రయోగించారు. అయినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో భద్రతా దళాలు నిరసనకారులపై విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేశాయి. ఈ ఘర్షణల్లో పలువురు విద్యార్థులు, పార్టీ కార్యకర్తలతో పాటు కొంతమంది పోలీసులకు కూడా గాయాలయ్యాయి. గాయపడిన వారికి ఘటనా స్థలంలోనే అత్యవసర ప్రథమ చికిత్స అందించారు. సెంట్రల్ ఢిల్లీకి కీలక మార్గమైన వికాస్ మార్గ్‌లోని ఐటీవో జంక్షన్ వద్ద కూడా ఆందోళనకారులను పోలీసులు అడ్డుకుని నిలిపివేశారు.

పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ముందస్తు జాగ్రత్త చర్యగా అధికారులు జంతర్ మంతర్, పటేల్ చౌక్, పార్లమెంట్ స్ట్రీట్, రైల్ భవన్ పరిసర ప్రాంతాలను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పార్లమెంట్‌కు వెళ్లే అన్ని రహదారులను మూసివేయడంతో పాటు, మెట్రో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఐదు ప్రధాన మెట్రో స్టేషన్లను తాత్కాలికంగా బంద్ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని సున్నితమైన ప్రాంతాలలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను సైతం నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు. నిబంధనలను ఉల్లంఘించి అల్లర్లకు కారణమైన సుమారు 15 మందికి పైగా ముఖ్య ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ భారీ ముట్టడి ప్రయత్నంతో ఢిల్లీ అంతటా హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

## మూడు కాదు..ఒక్క దాంట్లో గెలిచి చూపండి

### మరోమారు బిజెపి నేతలకు రాజాసింగ్ సవాల్

**హైదరాబాద్, జూలై20 :** నగరంలో మూడు కార్పోరేషన్లు గెలుస్తామని బిజెపి నేతలు ప్రకటించడాన్ని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఎద్దేవా చేశారు. మూడు కాదు..ఒక్కటైనా గెలిచి చూపాలని విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో బిజెపి నేతల తీరుపై, రాష్ట్రంలో బీజేపీ పరిస్థితిపై ఆ పార్టీ బహిష్కృత నేత రాజాసింగ్ సెటైర్లు వేశారు. బండి సంజయ్, ఈటల కలిస్తే పార్టీ అధికారంలోకి వస్తుందా.. అని పార్టీ రాష్ట్ర నేతలను ప్రశ్నించారు. వారి మధ్య సమస్యలు ఉండవచ్చని, పార్టీలో సీనియర్ నేతలు, కార్యకర్తల పరిస్థితి ఏంటని నిలదీశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మూడు కార్పొరేషన్‌లు గెలుస్తామని చెబుతున్నారని, ఒక్క కార్పొరేషన్‌లో సగం సీట్లయినా గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. బీజేపీలో కొందరికి అధ్యక్ష పదవి దక్కకుండా చేసేందుకే రాంచందర్‌రావును కూర్చొబెట్టారని పేర్కొన్నారు. రాంచందర్‌రావు చేతులు కట్టేసి పని చేయమంటే ఎట్లా..? అంటూ ప్రశ్నించారు. రాంచందర్‌రావు ఎంత బాధలో ఉన్నారో తెలుసని, ఒకరు చెప్పినట్టు పని చేయాలంటే ఎలా చేస్తారంటూ పరోక్షంగా కిషన్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. నేతల్లో సయోధ్య లేదని, అలాగే, పార్టీ

# ఆగస్టు 1న ప్రధాని మోడీ చేతుల మీదుగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి..** విభజన అనంతరం నాటి తెలుగుదేశం ప్రభుత్వం ఈ ప్రాంతంలో విమానాశ్రయ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయగా, అప్పటి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు చొరవతో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు దీనికి తొలిసారి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం భూసేకరణ పనులను పూర్తి చేసి, 2023 మే నెలలో నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రెండోసారి శంకుస్థాపన చేశారు. అయితే రాష్ట్రంలో మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు బాధ్యతలు స్వీకరించడంతో ఈ ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగి కేవలం రెండున్నరేళ్లలోనే పూర్తయ్యాయి. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పలుమార్లు నిర్మాణ పనులను స్వయంగా పర్యవేక్షించి సకాలంలో పూర్తయ్యేలా చూశారు. ఈ విమానాశ్రయం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు మూడు లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర మంత్రి వివిధ సందర్భాల్లో స్పష్టం చేశారు. పర్యాటక రంగంతో పాటు పారిశ్రామిక, రవాణా రంగాల్లో ఈ ప్రాజెక్టు రాబోయే తరాలకు బంగారు భవిష్యత్తును అందించనుంది.

విమానాశ్రయానికి అనుబంధంగా 136 ఎకరాల విస్తీర్ణంలో 'జీఎంఆర్- మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యు సిటీ'ని కూడా ఏడాదిలోగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇక్కడ పైలట్లు, రక్షణ రంగ నిపుణులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శిక్షణా సంస్థలు ఏర్పాటు కానున్నాయి. రానున్న రోజుల్లో ఈ ప్రాంతం నుంచి వ్యవసాయ, ఉద్యానవన పంటల ఉత్పత్తులు, సముద్ర సంపద, ఔషధ తయారీ ముడిసరుకుల ఎగుమతి, దిగుమతులు సాగడం ద్వారా ఏపీలోనే ఒక ప్రధాన పారిశ్రామిక హబ్‌గా ఇది అవతరించనుంది. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికులతో భారత విమానయాన రంగంలోనే ఈ ఎయిర్‌పోర్ట్ కీలక పాత్ర పోషించబోతోంది. అంతేకాకుండా, విమానాశ్రయం చుట్టూ పారిశ్రామిక, విద్యా, వైద్య మండలాలు తదితర వసతులతో కూడిన ఒక ఆధునిక నగరాన్ని (ఎయిరోట్రోపోలిస్) నిర్మించే ప్రతిపాదన కూడా ఉంది. ఇందులో భాగంగానే 139 ఎకరాలలో జీఎంఆర్ టౌన్‌షిప్ నిర్మాణం చేపట్టేందుకు ముమ్మర కసరత్తు జరుగుతోంది.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం: రూ.5 లక్షల సబ్సిడీతో పాటు స్థలం.. మంత్రుల వెల్లడి

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో సొంత ఇల్లు లేని పేద ప్రజల కలలను సాకారం చేసేలా క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు ప్రక్రియకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్లాట్ల కేటాయింపు కోసం ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రముఖ క్రికెటర్ అజారుద్దీన్‌లతో కలిసి ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వాట్సాప్ దరఖాస్తు విధానాన్ని, అధికారిక బ్రోచర్‌లను మంత్రి పొంగులేటి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన పేదలు మీ సేవ కేంద్రాలు, వాట్సాప్ మరియు అధికారిక వెబ్‌సైట్ ద్వారా రూ.10 వేల టోకెన్ మొత్తం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా లాటరీ (డ్రా) పద్ధతిలో జరుగుతుందని, డ్రాలో ఇళ్లు రాని వారికి వారు చెల్లించిన టోకెన్ డబ్బులను వెంటనే వెనక్కి ఇచ్చేస్తామని స్పష్టం చేశారు. ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారుల పేరిట స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు, ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని (సబ్సిడీ) అందిస్తామని వెల్లడించారు. అయితే, ఈ ఇళ్లను పొందిన వారు వచ్చే పదేళ్ల పాటు వాటిని అద్దెకు ఇవ్వడం గానీ, ఇతరులకు విక్రయించడం గానీ చేయకూడదనే కఠినమైన షరతు విధిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

రాజకీయాలు, పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా మొదటి దశలో 16 నియోజకవర్గాలను ఎంపిక చేసి 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో 7,680 ప్లాట్లను నిర్మిస్తున్నామని, త్వరలోనే మిగిలిన నియోజకవర్గాలకు కూడా దీనిని విస్తరిస్తామని మంత్రి పొంగులేటి వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నగరానికి 35 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించడం వల్ల పేదలు అక్కడికి వెళ్లలేకపోయారని, కానీ తమ ప్రభుత్వం చదరపు గజం లక్షల రూపాయల విలువ చేసే కోర్ ఏరియా (నగరం నడిబొడ్డున) లోనే టవర్లు నిర్మించి పేదలకు ఇస్తోందని స్పష్టం చేశారు. ఇప్పటికే రెండు విడతల్లో ఏడు లక్షల ఇళ్లు మంజూరు చేశామని, సొంత స్థలం ఉన్న వారికే కాకుండా స్థలం లేని నిరుపేదలకు కూడా ఈ పథకం వర్తింపజేస్తున్నామని తెలిపారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, గుడిసెలు లేని తెలంగాణను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, గతంలో కూడా హౌసింగ్ బోర్డు కాలనీల ద్వారా విలువైన భూములను పేదలకు ఇచ్చిన చరిత్ర తమ పార్టీదేనని గుర్తుచేశారు. ఇళ్ల కేటాయింపులో రిజర్వేషన్లు కూడా అమలు చేస్తామని ఆయన వెల్లడించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఇళ్లు లేక అద్దె ఇళ్లలో మగ్గుతున్న

# 'సర్'పై బండి రమేష్ విస్తృత సమావేశం

**హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 20, (జన సంఘర్షణ):**
సోమవారం కాంగ్రెస్ పార్టీ కూకట్పల్లి కార్యాలయంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు అధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ విస్తృత సమావేశం నిర్వహిచారు. 'సర్' ఆగస్టు 3 తో ముగియనుండటంతో పార్టీపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంటింటికి ఓటర్ ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, బియల్ఎ లకు ఎదురవుతున్న సమస్యలు గురించి చర్చించారు. ఎక్కడైనా సమస్య ఉంటే తమ దృష్టికి తేవాలని, దొంగ ఓట్ల నమోదుపై జాగ్రత్తగా ఉండాలని, ప్రతి ఓటర్ కి 'సర్' ప్రాముఖ్యతను వివరించాలని, ఈ పత్రాలను సమర్పించకపోతే ఓటు హక్కు కోల్పోతారని తెలియచెప్పే బాధ్యత బియల్ఎ లు తీసుకోవాలని రమేష్ సూచించారు. పదవులు ఇచ్చింది పనిచేయడానికి కానీ, హోదా కోసం కాదని, పార్టీకోసం పనిచేసేవారికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గర మనందరి ప్రోగ్రెస్ రిపోర్ట్ ఉందన్నారు, పార్టీలో సీనియర్ నేతలను కలుపుకుపోయి పార్టీని బలోపేతం చేయాలని రమేష్ సూచించారు. జిహెచ్ యం సి ఎన్నికలు మనకు సెమీఫైనల్ లాంటివని, ఈ సారి ప్రతి డివిజన్ లో త్రిముఖ పోరు ఉండబోతున్నారు. పనిచేసే ప్రతి ఒక్కరికి పార్టీలో గుర్తింపు ఉంటుందని, పార్టీలో పదవులు బండిరమేష్ ఇష్టం కాదని, గాంధీభవన్ ఆదేశాల మేరకు అందరం కలిసి పనిచేసి పార్టీని గెలిపించుకోవాలని తెలిపారు. 'సర్' ఇంచార్జి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. బియల్ఎ ఫామ్స్ సబ్మిషన్ తో పాటు డేటా కూడా సేకరించాలని, రాబోయే ఎన్నికల్లో అది మనకు ఉపయోగపడుతుందని సూచన చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ 'సర్' జిల్లా ఇంచార్జి సుబ్రహ్మణ్యం కూకట్పల్లి నియోజకవర్గ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, డివిజన్ అధ్యక్షులు, మహిళా, మైనారిటీ అధ్యక్షులు, నియోజక వర్గ యువజననేతలు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# దళిత-గిరిజన గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి

- **ఎస్సీ-ఎస్టీ సబ్ప్లాన్ నిధులను వెంటనే విడుదల చేయాలి**
- **తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు**



**సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ)**
సింగరేణి మండలంలోని దళిత, గిరిజన ఆవాస ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, ఎస్సీ-ఎస్టీ సబ్ప్లాన్ చట్టం ప్రకారం కేటాయించిన నిధులను తక్షణమే విడుదల చేసి ఆయా ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సింగరేణి మండలంలోని దళిత, గిరిజన ఆవాస ప్రాంతాల్లో నిర్వహించిన సర్వేలో పలు కీలక సమస్యలు వెలుగులోకి వచ్చాయని ఆయన తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, గృహాలు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందన్నారు. భూమిలేని వ్యవసాయ కార్మికులు ఉపాధి హామీ చట్టంలో మార్పుల కారణంగా ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత, గిరిజన ఆవాస ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, ఎస్సీ-ఎస్టీ సబ్ప్లాన్ నిధులను ఎలాంటి జాప్యం లేకుండా విడుదల చేసి, వాటిని పూర్తిగా దళిత, గిరిజన ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీల సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతోదయ అన్నపూర్ణ కార్డుల ద్వారా 35 కిలోల బియ్యం పొందుతున్న పేద దళిత, గిరిజన కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం కార్డులను రద్దు చేసే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసిన లబ్ధిదారులకు ఇప్పటికీ చివరి బిల్లులు చెల్లించలేదని, అలాగే కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద విడుదల చేయాల్సిన రూ.60 వేల ప్రోత్సాహకాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజనులకు రూ.6 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన ప్రతి కుటుంబానికి రాజకీయ పక్షపాతం లేకుండా మంజూరు చేయాలని కోరారు. విద్య, వైద్యం, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పోడు భూముల హక్కులు, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన సమస్యలను సర్వేలో గుర్తించామని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని నాగేశ్వరరావు కోరారు. దళిత, గిరిజన కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుని, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వం చేప, రొయ్య పిల్లలకు కొనుగోలుకు ప్రతి మత్స్య సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలి

- **మంచిర్యాల జిల్లా కేంద్రంలో మండలాల్లో చేపల మార్కెట్లో నిర్మించాలి**







**మంచిర్యాల జిల్లా, మంచిర్యాల పట్టణం, జులై 20 (జనసంఘర్షణ):**
తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి ఏవోకి, మత్స్యశాఖ ఏడికి పలు సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బోడెంకి చందు మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పేరుతో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లు, అధికారులు తినంగా మిగిలింది, మత్స్యకారులకు ఉచిత చేప పిల్లలు ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంవత్సరశీ ఉచిత చాప పిల్లలకు కూడా బడ్జెట్ కేటాయించకుండా తీవ్రమైన అన్యాయం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం బడ్జెట్లో బడా పెట్టుబడిదారులకు సంపన్న వర్గాలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు వారి ప్రయోజనాలను కాపాడుతున్నాయి. మత్స్యకారులు ప్రాణాలను లెక్కచేయకుండా కోట్లాదిమంది ప్రజలకు పోషకాహారాన్ని ఈ దేశానికి రాష్ట్రానికి వేల కోట్ల రూపాయలు సంపాదించి పెడుతున్న మత్స్యకారులకు బడ్జెట్లో న్యాయంగా రావాల్సిన వాట దక్కడం లేదు. ప్రతి మత్స్య సొసైటీ జల వనరులకు సరిపడేంత చేప, రొయ్య పిల్లలకు కొనుగోలు కోసం 100% సబ్సిడీతో నేరుగా మత్స్య సొసైటీ ఖాతాలోని నగదు జమ చేయాలి. పెండింగ్లో ఉన్న ఇన్సూరెన్స్ సెక్స్ విషయం చెల్లించాలి. జిల్లాలోని కార్పొరేషన్లో మూడెకరాల స్థలం కేటాయించి 200 కోట్ల రూపాయలతో 10 హోల్సేల్ చాపల మార్కెట్లు, మున్సిపాలిటీలలో ఎకరా స్థలం కేటాయించి 100 కోట్ల రూపాయలతో 100 రిటైల్ చేపల మార్కెట్లు, ప్రతి మండల కేంద్రంలో చాపల మార్కెట్లో నిర్మించాలి. ఎండిపోయిన చెరువులు కుంటలకు లీజులు రద్దు చేయాలి. చెరువులు కబ్జా కాకుండా ఫెన్సింగ్ వేయాలి. మత్స్యకారులకు టూ వీలర్, ఫోర్ వీలర్, 90% సబ్సిడీతో అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచర్ల రాజేందర్ మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులు, బోయరి రాజకుమార్, జూనియరి నారాయణ జిల్లా ఉపాధ్యక్షులు, మత్స్యకారుల సంఘం నాయకులు గుమ్మల శ్రీనివాస్, మొగుర్ల మహేష్, మల్లేష్, చంద్రశేఖర్ భూమయ్య, పిడుగు శ్రీనివాస్, సతీష్, రవి చిలుకయ్య, సిహెచ్ రాజ్ కుమార్, గగ్గూరు రాజన్న, నరేష్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

# జగన్నాధుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన బండి రమేష

**హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 20, (జన సంఘర్షణ):**
టెంపుల్ ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు సోమవారం రోజు నవజీవన్ నగర్ ,బాలానగర్ నందు కొలువై ఉన్న జగన్నాధుని టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్పల్లి పార్టీ ఇంచార్జి బండి రమేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు జరుగుతాయని తమ ఆహ్వానంతో ఆలయానికి విచ్చేసిన బండి రమేష్కి కృతజ్ఞతలు తెలిపి తీర్ధ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, పుష్ప రెడ్డి, తూము వేణు, పులి శివగౌడ్ రామ్మోహన్, మదన్మోహన్, శ్రీకాంత్ గౌడ్, యువజన నాయకులు, మహిళా నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# శశీకోరా గ్రామంలో పది లక్షలతో సిసి రోడ్డు ప్రారంభం


**వర్ని: జులై 20( జన సంఘర్షణ)**
నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రం ఈరోజు సోమవారం సిసి రోడ్డు పనులు చేశారు. శంకోరా గ్రామానికి 10లక్షల నేజేసీ సీసీ రోడ్డు పోచారం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరుకావడంతో ఈ రోజు సీసీ రోడ్డు ప్రారంభం కార్యక్రమం లో ఏఎంసి చైర్మన్ సురేష్ బాబా, జిల్లా కాంగ్రేస్ కార్యదర్శి వెలగపూడి గోపాల్, సర్పంచ్ హరిసింగ్, కలల్ గిరి, అబ్దుల్ బారి, ఉపసర్పంచ్ మంగ్తూ సర్పంచ్ల అధ్యక్షులు మద్దిపూడి శ్రీను, హరి, మోహన్ తారాచంద్, జవహర్ బలరాం. కె మోహన మాజీ సర్పంచ్ పాల్యా శ్రీను ప్రేమ్ అయి సాయిలు, గ్రామస్తులు పాల్గొన్నారు. పోచారం ఈ సందర్బంగా శంకోరా గ్రామానికి 10లక్షల సీసీ రోడ్డు శంక్షన్ చేసినందుకు గ్రామస్తులు పోచారం శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



# పట్టణాల్లో ఇందిరమ్మ ఇళ్లు నేటి నుంచే ప్రారంభం

- **నిజామాబాద్ జిల్లా రుద్రూర్ పట్టణాల్లో ఇందిరమ్మ ఇళ్లు..**
- **రేపటి నుంచే ప్రారంభం**

**రుద్రూర్: జూలై 20( జన సంఘర్షణ)**
తెలంగాణ : గ్రామీణ ప్రాంతాల తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు పట్టణ పేదలపై దృష్టి సారించింది. పట్టణాల్లోని తక్కువ ఆదాయ వర్గాల కోసం 'ఇందిరమ్మ ఇళ్లు - ఎల్ఐజీ హౌసింగ్ టవర్స్' పథకాన్ని జులై 20వ తేదీన ప్రారంభించనుంది. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (హైదరాబాద్ క్యూర్) పరిధిలో మొదలయ్యే ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆధునిక అపార్ట్మెంట్ తరహా గృహాలను సర్కారు నిర్మించనుంది. ఈ పథకానికి సంబంధించిన దరఖాస్తు విధానం, అర్హతల వివరాలను ప్రభుత్వం నేడు అధికారికంగా ప్రకటించనుంది.




# ఇల్లెందులో ఫిజియోథెరపీ ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేస్తా

- **ఎమ్మెల్యే కోరం కనకయ్య**
- **డాక్టర్ బాధావత్ రవి వినతికి సానుకూల స్పందన**

**సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్యను ప్రముఖ వైద్యుడు, మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బాధావత్ రవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాధావత్ రవి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పేద ప్రజలు, చిన్నారులు ఫిజియోథెరపీ సేవలు పొందేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లే ఆర్థిక స్థోమత లేని కుటుంబాల కోసం ఇల్లెందులోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే ఇటీవల ఇల్లెందుకు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను తీసుకురావడంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య చేసిన కృషిని అభినందించిన డాక్టర్ రవి, ఇదే తరహాలో ఫిజియోథెరపీ ఆస్పత్రి ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిజియోథెరపీ ఆస్పత్రి ఏర్పాటు వల్ల స్థానిక యువతకు విద్య, ఉపాధి అవకాశాలు పెరిగి గ్రామీణ ప్రాంతాల్లోనే సేవలు అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఫిజియోథెరపీ ఆస్పత్రి ఏర్పాటు మంచి ఆలోచన అని, దీనిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సానుకూల స్పందనకు డాక్టర్ బాధావత్ రవి కృతజ్ఞతలు తెలిపారు.





# చిన్నారుల ఓనిలా, పంచకట్టు వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్

- **సంధ్యారాణి, పార్ధులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే - కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు**




**సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ)**
కారేపల్లి మండలం గేట్ కారేపల్లి గ్రామానికి చెందిన చెరుకూరి కోటేశ్వరరావు - ఉమారాణి దంపతుల కుమార్తె సంధ్యారాణి ఓనిలా అలంకరణ వేడుక, కుమారుడు పార్ధు పంచకట్టు వేడుకలు కొత్తలింగాల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులు సంధ్యారాణి, పార్ధులను ఆశీర్వదించి వారి ఉజ్వల భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులను అభినందించి, చిన్నారులు విద్యా రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్, మాజీ సొసైటీ చైర్మన్ తోటకూరి శ్రీను, మాజీ ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దారావత్ పాండ్య నాయక్, మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న, మాజీ మార్కెట్ డైరెక్టర్ వాంకుడోత్ నరేష్, నాయకులు మండేపూడి సత్యనారాయణ, చెరుకూరి రమేష్, చెరుకూరి నర్సయ్య, భూక్య రాంకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
మంగళవారం
21 జులై 2026

# ఎం.ఎస్ అగర్వాల్ స్టీల్ కంపెనీని వెంటనే తొలగించాలి

- హియరింగ్ గ్రామాల్లోనే నిర్వహించాలని డిమాండ్.
- అగర్వాల్ కంపెనీపై గ్రామస్థుల గళమెత్తిన ఆందోళన.
- ప్రజాభిప్రాయమే తుది నిర్ణయానికి ఆధారం కావాలి.
- కంపెనీ కాదు. ప్రజల ప్రాణాలు ముఖ్యం.
- కలెక్టర్ గేటు వద్ద రెండు గ్రామాల ప్రజలు బైఠాయింపు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 20 (జన సంఘర్షణ)
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని చెట్ల గౌరారం, రంగయ్యపల్లి గ్రామాలకు చెందిన సుమారు 400 మంది గ్రామస్థులు సోమవారం మెదక్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఎం ఎస్ అగర్వాల్ ప్రైవేట్ లిమిటెడ్ స్టీల్ కంపెనీ విస్తరణను వెంటనే నిలిపివేసి, కంపెనీని గ్రామాల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు. ప్రతాప్‌రెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు తరలివచ్చారు.కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద పోలీసులు అడ్డుకోవడంతో గ్రామస్థులు అక్కడే బైఠాయించి ధర్నా నిర్వహించారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ కు వినతిపత్రం అందజేశారు. వారం రోజుల్లో జిల్లా కలెక్టర్ స్వయంగా రెండు గ్రామాలకు వచ్చి ప్రజల సమక్షంలో బహిరంగ హియరింగ్ నిర్వహించి, ప్రజాభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవాలని, లేదంటే వచ్చే సోమవారం వేలాది మందితో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ..గత 20 ఏళ్లుగా కంపెనీ నుంచి వెలువడుతున్న పొగ, దుమ్ము, శబ్ద కాలుష్యంతో రెండు గ్రామాల ప్రజల జీవనం నరకప్రాయంగా మారిందని ఆరోపించారు. నెలకు లక్ష క్వింటాళ్ల స్టీల్ ఉత్పత్తి కారణంగా కాలుష్యం తీవ్రస్థాయికి చేరిందన్నారు. వర్షం పడితే నల్లటి నీరు కురుస్తోందని, చెరువులు, బోర్లు కలుషితమై తాగునీటికి పనికిరావడం లేదని, ప్రస్తుతం మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. ఆరేసిన బట్టలు సాయంత్రానికి నల్లగా మారిపోతున్నాయని, మహిళలు చర్మవ్యాధులు, పిల్లలు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని, పంటలు దెబ్బతిని ప్రజలు సంపాదించిన డబ్బంతా ఆస్పత్రులకే ఖర్చవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీని వెంటనే తొలగించాలని, అది సాధ్యం కాకపోతే రెండు గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల మధ్య జరగాల్సిన హియరింగ్‌ను పోలీసుల మధ్య నిర్వహించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. జిల్లా కలెక్టర్ స్వయంగా గ్రామాలకు వచ్చి పారదర్శకంగా హియరింగ్ నిర్వహించి ప్రజాభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించాలని,



లేకుంటే నిరవధిక ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

**'కాలుష్యంతో బతకలేకపోతున్నాం'**

గ్రామస్థులు మాట్లాడుతూ.. “ఎం ఎస్ అగర్వాల్ స్టీల్ కంపెనీ వల్ల చెట్ల గౌరారం, రంగయ్యపల్లి గ్రామాల ప్రజల జీవితం నరకప్రాయంగా మారింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కంపెనీ నుంచి వెలువడే నల్లటి పొగతో ఇళ్లు, బట్టలు, చెట్లు దుమ్ముతో కప్పుకుపోతుండగా.. వర్షపు నీటితో చెరువులు, బోర్లు కలుషితమై తాగునీరు, వ్యవసాయ భూములు దెబ్బతింటున్నాయి. ప్రజల ఆరోగ్యం కంటే కంపెనీ ప్రయోజనాలకే అధికారులు పెద్దపీట వేస్తున్నట్లు కనిపిస్తోంది. జిల్లా కలెక్టర్ స్వయంగా రెండు గ్రామాలకు వచ్చి ప్రతి కుటుంబం అభిప్రాయాన్ని తెలుసుకుని ప్రజల నిర్ణయానికే ప్రాధాన్యం ఇవ్వాలి. కంపెనీని వెంటనే తొలగించి ప్రజలకు న్యాయం చేయాలి. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం” అని హెచ్చరించారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష

- బాలికల, మహిళలపై నేరాలకు పాల్పడేవారిపై చట్టం కఠినంగా వ్యవరిస్తుంది.
- పోక్సో కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు సిబ్బందిని అభినంధించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.


ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 20 (జన సంఘర్షణ)
మెదక్ జిల్లా హవేళి ఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 17 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు చాకలి ప్రవీణ్ (21 సంవత్సరాలు)కు జిల్లా పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ.డి.వి.శ్రీనివాస రావు తెలిపారు.కేసు వివరాలు వెల్లడిస్తూ నిందితుడు చకలి ప్రవీణ్ అదే ప్రాంతానికి చెందిన 17 సంవత్సరాల ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికను బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. దాని ఫలితంగా బాధిత బాలిక గర్భం దాల్చింది. తన మేనత్త వద్ద ఉంటూ చదువుకుంటున్న బాలికను, ఆమె స్నానం చేస్తున్న సమయంలో కడుపు ఎత్తుగా కనిపించడంతో అనుమానం వచ్చిన మేనత్త ప్రశ్నించగా, నిందితుడు ఇంట్లోకి వచ్చి బెదిరిస్తూ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక వెల్లడించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హవేళి ఘనపూర్ పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఏఎస్సై డి. విఠల్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి దర్యాప్తు అధికారి, మెదక్ రూరల్ సీఐ పాలవెల్లి కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి, అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణ సందర్భంగా భరోసా లీగల్ అడ్వైజర్ శ్వేత బాధిత బాలికకు సాక్ష్యం చెప్పే విషయంలో అవసరమైన సహకారం అందించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించారు. సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి నిందితుడిపై అభియోగాలు రుజువైనట్లు




నిర్ధారించి, 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిన్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో లైజనింగ్ అధికారి ఎస్సై విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీవో గౌస్ కేసు లో సహకరించారు. ఈ కేసులో శిక్ష పడేవిధంగా కృషి చేసిన సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బాలికలు, మహిళలపై లైంగిక నేరాలకు పాల్పడే వ్యక్తుల పట్ల చట్టం ఎలాంటి ఉపేక్ష చూపదని, పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల్లో మెదక్ జిల్లా పోలీసులు వేగవంతమైన, శాస్త్రీయ దర్యాప్తు చేపట్టి నిందితులకు కఠిన శిక్షలు పడేలా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చిన్నారులపై ఎలాంటి లైంగిక వేధింపులు, దాడులు లేదా దుర్వినియోగం జరిగినా భయపడకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు, డయల్-100, డయల్-112 లేదా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. బాధిత చిన్నారులకు చట్టపరమైన, వైద్యపరమైన, మానసిక సహాయాన్ని అందించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# బాధిత కుటుంబానికి మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి ఆర్థిక సహాయం

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 20 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయం పేట మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు కోమటిపల్లి గ్రామానికి చెందిన కొత్త పల్లి సిద్ధరాములు మృతి చెందారు. ఈ విషయం రెండో వార్డు కౌన్సిలర్ కుక్కు ప్రవీణ్ ద్వారా తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి,కౌన్సిలర్ ద్వారా మృతుడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులు మనోధైర్యం కోల్పోకుండా ఉండాలని, పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పచ్చుంటి రాజయ్య, మాంగ్య, గట్టు యాదగిరి, జాన్ తదితరులు పాల్గొన్నారు.

# పేరూరు గ్రామంలో 100 శాతం ఎస్ఐఆర్ జాబితా సర్వే పూర్తి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 20 (జన సంఘర్షణ)
మెదక్ మండలంలోని పేరూరు గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. గ్రామంలో ఓటర్ల వివరాల పరిశీలన, ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేసి 100 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎన్నికల సిబ్బందిని అభినందించారు.ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఓటరును గుర్తించి, వారి వివరాలను నమోదు చేయడంతో గ్రామం 100 శాతం సర్వే పూర్తి చేసిన గ్రామంగా నిలిచింది. ఈ కార్యక్రమంలోఉప సర్పంచ్ అనిల్, ఆర్ఐ లక్ష్మణ్, బీఎల్ఓలు, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, శేఖర్, రాజబాబు తదితరులు




పాల్గొని ఎన్నికల సిబ్బందిని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

# వానవాసి విద్యార్థుల చదువులకు సహకరించడం సంతోషకరం

- వనవాసీ కమిటీ సభ్యులు శివరాజ్ కిషోర్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల మండలం , జూలై 20(జనసంఘర్షణ ):
చర్ల మండలంలో ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండి విద్యార్థుల చదువులకు సహకరించడం సంతోష కరమని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం నిలయ కమిటీ సభ్యులు శివరాజు కిషోర్ అన్నారు. చర్లలోని రైస్ పేట గ్రామానికి చెందిన చీమకుర్తి రామకృష్ణ ప్రసాద్ కిట్టప్ప జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కొమరం భీం విద్యార్థి నిలయంకు 50 కేజీల బియ్యం, విద్యార్థులకు భోజనం, స్వీట్స్, పండ్లను అందచేసారు. ఈ సందర్భంగా





నిలయ ప్రముఖ్ సాంబయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కిషోర్ విద్యార్థులను ఉద్దేసించి మాట్లాడీ నారు,విద్యార్థి నిలయంకు దాతలు అందచేస్తున్న సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. పేద విద్యార్థుల చదువులకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళికృష్ణ మాట్లాడుతూ సంస్కారంతో కూడిన విద్య ఎంతో అవసరమని అన్నారు. దాతల మనోభావాలను అనుగుణంగా విద్యార్థులు చదివి సంస్థ పేరు ప్రతిష్టత ను నిలపాలన్నారు. ఇక్కడి విద్యార్థుల క్రమశిక్షణ దాతలను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. ఇదే క్రమ శిక్షణను కొనసాగించి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిలయ కమిటీ సభ్యులు, విద్యార్థులు స్వర్గీయ రామకృష్ణ ప్రసాద్ కు పూలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వనవాసీ జిల్లా సహ కార్యదర్శి గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, శబరి బాలికా నిలయ ప్రముఖ్ వరలక్ష్మి పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బండమీది మైసయ్య మృతి

- గ్రామ సర్పంచ్ మానెగల రామకృష్ణయ్య 5,000 రూపాయల ఆర్థిక సహాయం అందచేత.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతిని జులై 20 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామానికి చెందిన బండమీది మైసయ్య అనారోగ్య కారణంగా మరణించడం జరిగింది. ఇట్టి కుటుంబానికి సర్పంచ్ మానెగళ్ళ రామకృష్ణయ్య ఆర్థిక సాయం 5000 రూపాయలు ఇవ్వడం జరిగింది. ఇందులో గ్రామ ఉపసర్పంచ్, వార్డ్ నెంబర్స్, గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.

# పులి శివా గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ కార్యక్రమం

- ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్.

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 20, (జన సంఘర్షణ):




కూకట్పల్లి నియోజకవర్గంలోని బాలనగర్ డివిజన్‌లో పులి శివా గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా బండి రమేష్ కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ, కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజలతో నిత్యం అనుసంధానమై ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పులి శివా గౌడ్‌తో పాటు పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను బండి రమేష్ అభినందించారు. బాలనగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్ప రెడ్డి, శ్రీకాంత్ పటేల్, తూము వేణు, రామ్మోహన్, మదన్మోహన్, శ్రీకాంత్ గౌడ్, యువజన నాయకులు, మహిళా నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన నాగరాజు కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 20; (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన ఎరుకల నాగరాజు అనారోగ్య కారణంతో మరణించారు వారి భార్య కూడా గత కొద్ది రోజుల క్రితం మరణించడం జరిగింది. వారికి ఉన్న ఇద్దరు పిల్లలు అనాధలు అయిపోయారు ఇట్టి సమాచారాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీల గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ వారి ఊరికి చేరుకొని కుటుంబాన్ని కలిసి పరామర్శించి ఆడబిడ్డ పేరుమీద 10,000 రూపాయలు ఫిక్స్ డిపాజిట్‌లి చేసి అట్టి బాండ్ పేపర్ పిల్లలకు అందించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లేశం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజ్ కుమార్, గ్రామ అధ్యక్షుడు స్వామి, పిఎసిఎస్ చైర్మన్ సత్యనారాయణ, శంకరంపేట మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, శంకరంపేట గ్రామ అధ్యక్షుడు మోహన్ నాయక్, వార్డు మెంబర్లు మహేందర్ సల్లావుద్దీన్ ఆంజనేయులు మహిపాల్, మత్స్య శాఖ మాజీ చైర్మన్ అశోక్, పాండు, ఆంజనేయులు, అక్బర్, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు రాజశేఖర్ రెడ్డి, ప్రవీణ్, సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కరించాలి

- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన డబుల్ బెడ్ రూమ్ వాసులు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 20 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ లో సమస్యలనువెంటనే పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణి కార్యక్రమంలో డబుల్ బెడ్ రూమ్ వాసులు వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాల క్రితం ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ లను కేటాయించడం జరిగిందని అందులో సీసీ రోడ్డు లేకపోవడం మురికి కాలువలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని డబుల్ బెడ్ రూమ్ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు వర్షాకాలం వచ్చిందంటే రోడ్డుపైన నడవలేని పరిస్థితి ఉంటుందని పాములు తేళ్లు తిరుగుతుంటాయని వారు ఆరోపించారు. ముఖ్యంగా మంచినీటి వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని భగీరథ మంచినీళ్లు డబుల్ బెడ్ రూమ్ పైకి రావడం లేదని వారు తెలిపారు. వచ్చే నీళ్లు కింది నుండి ఎత్తుకోవాల్సిన అవసరం ఉందని దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా మంచినీటి వస్తుంది కల్పిస్తూ సిసి రోడ్డు మంజుల చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్ రూమ్ కాలనీవాసులు యాదగిరి. స్వప్న. రేణుక. శేఖర్ ఎండి మసీద్ తదితరులు పాల్గొన్నారు.

## హవేలీ ఘనపూర్ మండలములో సర్ ప్రక్రియ 90 శాతం పూర్తి

- సింధు రేణుక.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 20 (జన సంఘర్షణ)




మెదక్ జిల్లా హవేలి ఘనపూర్ మండలంలో 90శాతం ఎస్ ఐ ఆర్ పక్రియ శేరవేంగంగా పూర్తయిందని ఏమ్మార్వో సింధు రేణుక తెలిపారు.సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని బిఎల్వోలు చురుకుగా పని చేస్తున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ సూచన మేరకు ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా మండలంలో ప్రతి ఒక్కరు చాలా బాగా పని చేస్తున్నారని అన్నారు. సర్ పక్రియలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకొనడానికి బిఎల్ఓ లకు సహకరిస్తున్నారని తెలిపారు. గ్రామాలలో నూతనంగా ఎన్నుకోబడ్డ సర్పంచులు ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి చాలా కష్టపడుతున్నారని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో పాల్గొంటున్నారని స్పష్టం చేశారు. గ్రామాలలో విద్యార్థులు నిరుద్యోగ యువకులు సర్ ప్రక్రియ వేగవంతంగా చేయడానికి సహకరించారని తెలిపారు. 90% పూర్తయిన సార్ ప్రక్రియ ప్రభుత్వం ఇచ్చిన గడువు ముందే పూర్తి చేసి 10 శాతం దానిని ఈ రెండు మూడు రోజుల్లో పూర్తిచేసి మెదక్ జిల్లాలోని బెస్ట్ మండలం గా అవార్డు తీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష

- జిల్లా పోలీసు కార్యాలయం మెదక్ జిల్లా
- బాలికల, మహిళలపై నేరాలకు పాల్పడేవారిపై చట్టం కఠినంగా వ్యవరిస్తుంది.
- పోక్సో కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు సిబ్బందిని అభినంధించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,


ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 20 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా హవేళి ఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 17 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు చాకలి ప్రవీణ్ (21 సంవత్సరాలు)కు జిల్లా పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ.డి.వి.శ్రీనివాస రావు తెలిపారు.కేసు వివరాలు వెల్లడిస్తూ నిందితుడు చకలి ప్రవీణ్ అదే ప్రాంతానికి చెందిన 17 సంవత్సరాల ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికను బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. దాని ఫలితంగా బాధిత బాలిక గర్భం దాల్చింది. తన మేనత్త వద్ద ఉంటూ చదువుకుంటున్న బాలికను, ఆమె స్నానం చేస్తున్న సమయంలో కడుపు ఎత్తుగా కనిపించడంతో అనుమానం వచ్చిన మేనత్త ప్రశ్నించగా, నిందితుడు ఇంట్లోకి వచ్చి బెదిరిస్తూ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక వెల్లడించింది.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హవేళి ఘనపూర్ పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఏఎస్సై డి. విఠల్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి దర్యాప్తు అధికారులు, మెదక్ రూరల్ సీఐ పలవెల్లి, అప్పటి మెదక్ డియస్పి కృష్ణ మూర్తి కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి, అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణ సందర్భంగా భరోసా లీగల్ అడ్వైజర్ శ్వేత బాధిత బాలికకు సాక్ష్యం చెప్పే విషయంలో అవసరమైన సహకారం అందించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించారు. సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి నిందితుడిపై అభియోగాలు రుజువైనట్లు నిర్ధారించి, 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిన్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో లైజనింగ్ అధికారి ఎస్సై విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీవో గౌస్ కేసు లో సహకరించారు. ఈ కేసులో శిక్ష పడేవిధంగా కృషి చేసిన సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మాట్లాడుతూ... బాలికలు, మహిళలపై లైంగిక నేరాలకు పాల్పడే వ్యక్తుల పట్ల చట్టం ఎలాంటి ఉపేక్ష చూపదని, పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల్లో మెదక్ జిల్లా పోలీసులు వేగవంతమైన, శాస్త్రీయ దర్యాప్తు చేపట్టి నిందితులకు కఠిన శిక్షలు పడేలా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చిన్నారులపై ఎలాంటి లైంగిక వేధింపులు, దాడులు లేదా దుర్వినియోగం జరిగినా భయపడకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు, డయల్-100, డయల్-112 లేదా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. బాధిత చిన్నారులకు చట్టపరమైన, వైద్యపరమైన మరియు మానసిక సహాయాన్ని అందించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

## ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమను తొలగించకపోతే రహదారులను దిగ్బంధం చూస్తాం

- ఒంటేరు ప్రతాప్ రెడ్డి.
- ఈ రెండు గ్రామాలలో మహిళలకు ఆరోగ్యం ఇబ్బందులు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 20 (జన సంఘర్షణ)





ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమను తొలగించకపోతే రహదారులను దిగ్బంధం చేస్తామని గజ్వేల్ బి ఆర్ ఎస్ నాయకులు ఒంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. చెట్ల గౌరారం,రంగయ్య పలిగ్రామాలలో మహిళలకు ఆరోగ్య ఇబ్బందులు ఉండడం వల్ల ఆ గ్రామానికి పిల్లనివ్వడం లేదు. అని పద్మజ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం నాడు మెదక్ ప్రజావాణి కార్యక్రమం లో మనోహరాబాద్ మండలం రంగయ్యపల్లి, చెట్ల గౌరారం గ్రామస్తులు వినతి పత్రం ఇవ్వడానికి ఒంటేరు ప్రతాప్ రెడ్డి పద్మ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయానికి చేరుకోగానే అక్కడున్న పోలీసులు వారిని అడ్డుకొని గేటు వద్దే ఉంచారు. విషయాన్ని పై అధికారులు సూచనలు ఇచ్చేవరకు గేటు వద్దే ఉండాలని పోలీసులు కోరడంతో పద్మ దేవేందర్ రెడ్డి ఒంటె ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు సుమారు 500 మంది వరకు తెలుగు గ్రామాల ప్రజలు చేరుకుని వాళ్ళ సమస్యలు తెలపడానికి వచ్చామని పోలీసులతో మొరపెట్టుకోవడంతో అయినా పోలీసులు వినకపోవడం పట్ల వాళ్లు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఒకసారి జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు అయినా ఎం ఎస్ అగర్వాల్ పారిశ్రామిక ఫ్యాక్టరీ కోసం ప్రజా అభిప్రాయ సేకరణ న్యాయబద్ధంగా జరగలేదని అన్నారు. అందులో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ పూర్తిగా అవకతవక మధ్యన జరిగిందని మండిపడ్డారు. ప్రజల మన ప్రాణాలకు ముప్పు కలిగిన అధికారులుస్పందించకపోవడం ఇంతవరకు ఫ్యాక్టరీకి ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడం పట్ల ఆశ్చర్య వ్యక్తం చేశారు. ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమను తొందరగా మూసివేసి ఆ రెండు గ్రామాల ప్రజల ను కాపాడాలని డిమాండ్ చేశారు. ఒంటేరు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెస్ అగర్వాల్ కంపెనీ అధికారులను డబ్బుతో కొన్నదని అక్కడున్న ప్రజలను గురించి పట్టించుకునే స్థితిలో లేదు అని అన్నారు ఆ కంపెనీని ప్రజల గురించి ఆలోచించడం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి టాక్స్ కట్టకుండా ఫ్యాక్టరీ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తుందని అందుకు పోలీస్ డిపార్ట్మెంట్ సహాయం చేస్తుందని గ్రామంలో యువకులు ఫ్యాక్టరీ గురించి అడిగితే వారిపై కేసులు పెడుతున్నారని మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. ఈ ఫ్యాక్టరీ మూసేసంతవరకు మరోసారి ఉద్యమం తప్పదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ విషయంపై స్పందించి రెండు గ్రామాల ప్రజలకు న్యాయం చేసి ఆ కంపెనీని మూసివేయాలని డిమాండ్ చేశారు.

## కేజిబివి యూఆర్ఎస్ సర్వ శిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ సర్వీస్ రెగ్యులరైజ్ చెయ్యాలి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 20: (జన సంఘర్షణ)




తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టి ఎస్ యు టి ఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం నాడు మెదక్ జిల్లా జిన్నారం మండల పరిధిలోని కేజీవీబీ పాఠశాల, ఎంఆర్ సి లో పనిచేస్తున్న సర్వ శిక్ష ఉద్యోగుల పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీఎస్ యుటిఎఫ్ జిన్నారం మండల ఆధ్యక్షురాలు టీ. ఉమాదేవి మాట్లాడుతూ కేజీబీవీ, యుఆర్ఎస్ మరియు సర్వ శిక్ష ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి కి పోస్ట్ కార్డుల ద్వారా విన్నవించడం కోసం ఈపోస్ట్ కార్డుల ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా తీసుకోవడం జరిగిందన్నారు. అన్నారు. టీఎస్ యుటిఎఫ్, కేజీబీవీ రాష్ట్ర ఆద్యక్షరాలు విశాలాక్షి మాట్లాడుతూ కేజీబీవీ/యు ఆర్ ఎస్/ఎస్ ఎస్ ఏ ఉద్యోగ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింప చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సెలవు సౌకర్యాలు కల్పించాలని, వార్షిక ఇంక్రిమెంట్, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, కేర్ టేకర్లను నియమించాలని, సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని మొదలగు డిమాండ్స్ పరిష్కరించాలని కోరుతూ గౌరవ ముఖ్య మంత్రి గారికి పోస్ట్ కార్డ్ ఉద్యమం ప్రంబించామని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆద్యక్షురాలు విశాలాక్షి. రాష్ట్ర కమిటీ సభ్యులు అమరేశ్వరీ జిన్నారం మండల అధ్యక్షురాలుఉమాదేవి,జిన్నారం మండల జనరల్ సెక్రెటరీ కేశవ రావు,జిన్నారం కవిత, జిన్నారం గుమ్మడి దల టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## చర్ల మండల ప్రజల నీటి దాహం తీర్చిన రాజ్యసభ సభ్యులు

- ఏంపి వద్దిరాజు రవిచంద్ర

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జులై 20(జనసంఘర్షణ ):





చర్ల మండల బిఆర్ యస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు ప్రాతినిధ్యం మేరకు చర్ల మండల ప్రజలు నీళ్ల సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయం తెలియజేయడంతో ఎంపి రవిచంద్ర, వారి ప్రత్యేక నిధుల తో చర్ల మండలంలోని 8 చేతి పంపులు మంజూరు చేసారు. గత నెలలో కుదునూరు, ఆర్ కొత్తగూడెం, కలివేరు, తిప్పాపురం,పాత చర్ల లింగాపురం పాడు, రాళ్ళగూడెంలో గ్రామాల్లో సుమారు 20 లక్షల రూపాయల వ్యయంతో మంచినీటి బోర్లను వేయించడం జరిగింది. ఈరోజు అన్ని బోర్లులకు మిగిలిన సామాగ్రి బిగించడం వలన అన్ని బోర్ పంపులు నీరు పుష్కలంగా ధారాళం నీరు రావడం ప్రజలు బిఆర్ఎస్ పార్టీ ఎంపి రవిచంద్రకి ప్రజలు ధన్యవాదాలు తెలియజేసారు. భద్రాచలం నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు ఉన్న ప్రజల నీళ్ల సమస్య కాని రోడ్ల సమస్యలు కాని పట్టించుకోవడం లేదని అధికారంలో లేక పోయినా బిఆర్ఎస్ పార్టీ నాయకులు దగ్గర ఉండి 200 అడుగుల వరకు బోర్లు వేయించినందుకు ఆర్ కొత్తగూడెం ఎస్సీ కాలని ప్రజలు కూరపాటి వీర్రాజు అనేక సంవత్సరాలుగా ఉన్న నీళ్ల బాధ తీర్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రతీ పంచాయతీ నుండి ప్రజలు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. ఇంకా నీళ్లు ఇబ్బంది ఉన్న పంచాయతీలకు రెండవ సారి అవకాశం కల్పిస్తాము.

# ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల దాడి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం...

◆ **తీవ్రంగా ఖండించిన సింగరేణి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్.**

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత వ్యక్తం చేస్తున్న ఆందోళనలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన సమయంలో, ఢిల్లీలో "మార్చ్ టు పార్లమెంట్" పేరుతో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం అత్యంత దురదృష్టకరమైన, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని సింగరేణి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్ తీవ్రంగా ఖండించారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ..రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని, ముఖ్యంగా దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా ఆందోళన చేపడితే, వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో వారిపై బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలు, పేపర్ లీకేజీ ఆరోపణలతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యారని,వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. ఈ అంశంపై పారదర్శకంగా స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం,సమస్యను పరిష్కరించే బదులుగా ప్రశ్నిస్తున్న విద్యార్థుల గొంతును అణిచివేయడానికి పోలీసు వ్యవస్థను వినియోగించడం తీవ్రంగా ఖండనీయమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలు, నిరసనలు సహజమని, వాటిని అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం,వారిని బలవంతంగా అదుపులోకి తీసుకోవడం వంటి చర్యలు కేంద్ర ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని,గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని, నీట్ పేపర్ లీకేజీ ఘటనపై సమగ్ర,పారదర్శక దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గుగులోత్ హర్ష నాయక్ కేంద్ర



ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ యువత విశ్వాసాన్ని కాపాడటం, పరీక్షల వ్యవస్థపై నమ్మకాన్ని పునరుద్ధరించడం ప్రభుత్వ బాధ్యత అని, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను గౌరవించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు.

---

# ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ చర్యలు

◆ **పారదర్శకంగా విచారణ చేపట్టాలి.**
◆ **మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 20 (జన సంఘర్షణ)



ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి ఒక్కో అర్జీని పరిశీలించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, సామాజిక, భూ వివాదాలు, మోసాలు, వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను తెలియజేశారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండరాదని, ప్రతి వినతిదారునికి వారి ఫిర్యాదు పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా పోలీసు వ్యవస్థపై విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా తమ సమస్యల పరిష్కారం కోసం పోలీసులను సంప్రదించాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

---

# బినామీ పేరుతో వీఆర్ఏ విధులా..?

◆ **సమగ్ర విచారణ చేపట్టాలని రైతుల డిమాండ్**

సింగరేణి ప్రతినిధి: (జన సంరక్షణ)

మండల తహసీల్దార్ కార్యాలయంలో బినామీ పేరుతో వీఆర్ఏ విధులు నిర్వహిస్తున్నారంటూ ఆరోపిస్తూ రెండు గ్రామపంచాయతీలకు చెందిన రైతులు సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి, ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్లోజి శ్రీనివాస్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. రైతులు సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, రెవెన్యూ సంబంధిత పనుల విషయంలో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అధికార పరిధి లేకుండానే జోక్యం చేసుకుంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ అంశంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్యకు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం సమర్పించిన అనంతరం రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి నినాదాలు చేశారు. తమ ఫిర్యాదును అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలతి కిషోర్, గుజ్జర్లపూడి సైదులు, పాటి రమేష్,



పాటి రంగయ్య, మాల స్వామి, పోతుల సత్యం, పోతుల వెంకటేశ్వర్లు, కొండం వెంకటేశ్వర్లు, పాటి రామయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

---

# ప్రాణాలు తీసే విషపూరిత కంపెనీ పనులు ఆపివేయాలి

◆ **గ్రామస్తురాలు శ్యామల.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 20 (జన సంఘర్షణ)




మెదక్ జిల్లా: మెదక్ మండలం రంగాయిపల్లి చెట్ల గౌరారం పరిసర ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీ వల్ల గ్రామ ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని గ్రామస్తురాలు శ్యామల ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ నుంచి వెలువడుతున్న దుర్వాసనలు, కాలుష్యం కారణంగా గ్రామంలో పలువురు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, చర్మ సమస్యలు, ఇతర ఆరోగ్య ఇబ్బందులతో బాధపడుతున్నారని ఆమె తెలిపారు. గ్రామ ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ విషపూరిత కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు గ్రామంలో పరిశీలన చేపట్టి ప్రజల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయాలని కోరారు. కంపెనీపై కఠిన చర్యలు తీసుకుని గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని శ్యామల విజ్ఞప్తి చేశారు.

---

# ప్రతి సోమవారం అన్నదానంతో ఆదర్శంగా నిలుస్తున్న వాటర్‌మ్యాన్ రమేష్





పోతంగల్, జూలై 20 (జన సంఘర్షణ):


పోతంగల్ మండల కేంద్రంలో వాటర్‌మ్యాన్ రమేష్ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా ప్రతి సోమవారం నిరంతరంగా లింగమయ్య గుట్టమీద శివాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమం స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. అన్నదాన కార్యక్రమం విజయవంతంగా కొనసాగేందుకు సహకరిస్తున్న దాతలు, మిత్రులు, గ్రామ ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ పటేల్, మహేందర్ సేట్, గాండ్ల గజ్జు, గాండ్ల సాయిబాబా, డీజే అనిల్, ఏముల అబ్బయ్యతో పాటు పలువురు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని అన్నదాన సేవలో తమ వంతు సహకారం అందించారు. "అన్నదానం మహాదానం" అనే స్ఫూర్తితో ప్రతి సోమవారం కొనసాగుతున్న ఈ కార్యక్రమం పోతంగల్‌లో సేవా భావానికి ప్రతీకగా నిలుస్తోంది.

---

# మెదక్ కలెక్టరేట్ ప్రజావాణి హెల్ప్ డెస్క్‌కు వినతుల వెల్లువ

◆ **వివిధ సమస్యలపై ప్రజల నుండి 85 దరఖాస్తుల స్వీకరణ.**
◆ **మెదక్ కలెక్టరేట్లో హెల్ప్ డెస్క్ ద్వారా వివిధ సమస్యలపై ప్రజల నుండి ప్రజావాణి దరఖాస్తులు స్వీకరణ.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 20 (జన సంఘర్షణ)



సోమవారం ఉమ్మడి జిల్లా ఎల్ –నినో ప్రభావం మంత్రివర్యుల సమావేశానికి జిల్లా కలెక్టర్ ఇతర శాఖల అధికారులు సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లిన సందర్భంగా అధికారులు అందుబాటులో లేకపోవడం వల్ల హెల్ప్ డేస్ ద్వారా ప్రజావాణి నిర్వహించి ప్రజలు వద్ద నుండి 85 స్వీకరించి దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు పంపించడం జరుగుతుందని సమస్యలు పరిష్కార దిశగా కృషి చేస్తున్నట్లు హెల్ప్ డెస్క్ సిబ్బంది తెలిపారు.

---

# ఆగష్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

◆ **కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణకు రావాలని ఎమ్మెల్యే డా తెల్లం వెంకట్రావుకు ఆహ్వానం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం, జులై 20(జనసంఘర్షణ):

చర్ల మండల కేంద్రంలో ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరుతూ, భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు కి చర్ల మండలం ఆదివాసీ జేఏసీ బృందం కరపత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆదివాసీ సమాజ చరిత్ర, సంస్కృతి, హక్కుల పరిరక్షణకు ప్రతీకగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొని ఆదివాసీ ప్రజలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ను జేఏసీ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ చైర్మన్ వాసం. ముసలయ్య, ఇరప. రాజు దొర, కారం. నరేష్, పూనెం. వరప్రసాద్,శ్యామల. తరుణ్,బీరబోయిన రాణి తదితరులు పాల్గొన్నారు.



---

# తెలంగాణలో 10 జిల్లాలకు స్పెషల్ ఐఏఎస్ అధికారుల నియామకం




హైదరాబాద్/ జూలై 20/( జన సంఘర్ష ణ)

తెలంగాణలో భారీ వర్షాలు, వరదల పరిస్థితులను, ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు, సీజనల్ పరిస్థితుల పర్యవేక్షణను సమర్థంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం 10 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. హైదరాబాద్కు జయేష్ రంజన్, రంగారెడ్డికి వికాస్ రాజ్, కరీంనగర్కు బెన్హర్ మహేష్ దత్ ఎక్కా, మెదక్కు వాణి ప్రసాద్, నిజామాబాద్కు డాక్టర్ యోగితా రాణా, నల్గొండకు హరిచందన, ఆదిలాబాద్కు ఇలంబరితి, వరంగల్కు శ్రీదేవసేన, మహబూబ్నగర్కు వి.పి. గౌతమ్, ఖమ్మంకు అనుదీప్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# హైదరాబాద్‌కు బీఆర్ఎస్ శ్రేణుల భారీ తరలింపు...

❑ కేటీఆర్ సమక్షంలో చేరిక కార్యక్రమానికి పోతంగల్ మండలం నుంచి నాయకులు, కార్యకర్తల వెల్లువ





**పోతంగల్, జూలై 20 (జన సంఘర్షణ):**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన పార్టీ చేరిక కార్యక్రమానికి హాజరయ్యేందుకు పోతంగల్ మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఏ. హకీమ్ ఆధ్వర్యంలో ఈ తరలింపు జరిగింది. దేశాయిపేట్ గ్రామానికి చెందిన శ్రీను బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా మండలవ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.ఏ. హకీమ్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలపై పోరాటాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సంస్థాగత బలాన్ని మరింత పెంచాలని సూచించారు. కార్యక్రమానికి పోతంగల్ మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

# బిచ్కుంద అభివృద్ధిపై ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ప్రత్యేక దృష్టి





❑ సెంటర్ లైటింగ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే

**బిచ్కుంద, జూలై 20 (జన సంఘర్షణ):**
బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలో వేగంగా కొనసాగుతున్న సెంటర్ లైటింగ్ పనులను స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యతా ప్రమాణాలకు ఎలాంటి లోటు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా, నిర్దేశిత గడువులోనే లైటింగ్ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రజలు కూడా సెంటర్ లైటింగ్ పనులు పూర్తయితే రాత్రి వేళల్లో రాకపోకలు మరింత సురక్షితంగా మారడంతో పాటు పట్టణానికి మరింత అందం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బిచ్కుంద అభివృద్ధికి ఎమ్మెల్యే తీసుకుంటున్న ప్రత్యేక చొరవను పలువురు అభినందించారు.

# ఏడు నెలల చిన్నారి హత్యాయత్నం కేసును ఛేదించిన బీర్కూర్ పోలీసులు

❑ తండ్రి, సవతి తల్లి ఇద్దరు అరెస్ట్ - కుక్కలు ఎత్తుకెళ్లాయంటూ నమ్మించే ప్రయత్నం విఫలం
❑ చిన్నారిని అంతమొందించేందుకు తండ్రి-సవతి తల్లి
పన్నిన పథకం బట్టబయలు
❑ బాన్సువాడ డిఎస్పి విట్టల్ రెడ్డి మీడియా సమావేశంలో




**బీర్కూర్./జూలై 20/(జన సంఘర్షణ)**
కామారెడ్డి జిల్లా బాన్సుడ నియోజకవర్గం బీర్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 7 నెలల చిన్నారి వైష్ణవిపై జరిగిన హత్యాయత్నం ఘటనను బీర్కూర్ పోలీసులు శాస్త్రీయ దర్యాప్తు, సాంకేతిక ఆధారాలు మరియు నిందితుల విచారణ ఆధారంగా ఛేదించి, చిన్నారి తండ్రి , సవతి తల్లిని అరెస్ట్ చేసినట్లు బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి వెల్లడించారు.
ఫిర్యాదుదారురాలు సంకు సంధ్య, నివాసం బీర్కూర్, తన ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం, సుమారు రెండేళ్ల క్రితం తన అక్క శైలజ భర్త టేకు సతీష్ను రెండో వివాహం చేసుకుంది. వీరికి 7 నెలల కుమార్తె వైష్ణవి జన్మించింది. అనంతరం దాంపత్య విభేదాల కారణంగా పెద్దల సమక్షంలో విడిపోయి, చిన్నారి వైష్ణవిని తండ్రి సతీష్ వద్దే ఉంచాలని నిర్ణయించారు.
ఈనెల 15-07-2026 ఉదయం చిన్నారి ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా, ఇంటి సమీపంలోని ముళ్ల పొదల్లో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో లభించింది. చిన్నారిని వెంటనే బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుండి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై చిన్నారి తల్లి సంధ్య, తన కుమార్తెను హత్య చేయాలనే ఉద్దేశంతో తన అక్క శైలజ ఈ దారుణానికి పాల్పడిందని అనుమానం వ్యక్తం చేస్తూ బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర, మేరకు, బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి పర్యవేక్షణలో, బాన్సువాడ రూరల్ సీఐ శ్రీ తిరుపయ్య, బీర్కూర్ ఎస్ఐ రాములు మరియు పిట్లం ఎస్ఐ ఆంజనేయులు మరియు సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం శాస్త్రీయ దర్యాప్తు చేపట్టింది.
**కేసు వివరలోకెళ్తే :**
దర్యాప్తులో టేకు సతీష్‌కు మొదటి భార్య శైలజతో ముగ్గురు పిల్లలు ఉన్నట్లు, అనంతరం అతను శైలజ చెల్లెలైన సంధ్యను రెండో వివాహం చేసుకొని వైష్ణవికి తండ్రి అయినట్లు తెలిసింది. విడాకుల అనంతరం చిన్నారి వైష్ణవి తండ్రి వద్దే ఉండగా, ఆమెను పోషించడం భారంగా మారిందనే భావనతో, అలాగే కుటుంబ విభేదాల నేపథ్యంలో చిన్నారిని అడ్డు తొలగించుకోవాలని టేకు సతీష్, శైలజ కుట్ర పన్నినట్లు విచారణలో వెల్లడైంది.యఈనెల 14-07-2026 అర్ధరాత్రి సమయంలో ఇంటి బయట నిద్రిస్తున్న చిన్నారి వైష్ణవిని ఇద్దరూ కలిసి తీసుకెళ్లి, సీసీ రోడ్డుపై ఈడ్చుకుంటూ కొంత దూరం తీసుకెళ్లి, అనంతరం గడ్డి ఉన్న ప్రదేశంలో పడుకోబెట్టి, వెంట తీసుకెళ్లిన బ్లేడ్లతో చిన్నారి శరీరంపై పలుచోట్ల గాయాలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. చిన్నారి ఏడుపు ఆగిపోవడంతో చనిపోయిందని భావించి అక్కడే వదిలేసి ఇంటికి తిరిగి వెళ్లినట్లు నిందితులు విచారణలో ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. మరుసటి రోజు ఉదయం చిన్నారి కనిపించడం లేదని గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చి, గ్రామస్తులతో కలిసి వెతుకుతున్నట్లు నటించారు. చిన్నారి ఉన్న ప్రదేశం ముందుగానే తెలిసి కూడా, అక్కడికి వెళ్లి కనిపించినట్లు చెప్పి, ఎలాంటి అనుమానం రాకుండా బంధువులతో కలిసి ఆసుపత్రికి తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఘటన అనంతరం చిన్నారిని రాత్రి సమయంలో కుక్కలు ఎత్తుకెళ్లి గాయపరిచినట్లు గ్రామస్తులు, బంధువులు, పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసినట్లు విచారణలో తేలింది. అయితే సాంకేతిక ఆధారాలు, శాస్త్రీయ పరిశీలన, సాక్షుల వాంగ్మూలాలు, నిందితుల విచారణ ఆధారంగా అసలు వాస్తవాలను పోలీసులు వెలికితీశారు. అనంతరం నిందితులు తమ నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.
**అరెస్టు చేసిన నిందితులు**
1.టేకు సతీష్ (చిన్నారి వైష్ణవి తండ్రి) 2. సంకు శైలజ (చిన్నారి సవతి తల్లి)
**స్వాధీనం చేసుకున్న వస్తువులు**
ఒక రెడ్మీ క్రీమ్ కలర్ స్మార్ట్‌ఫోన్ 2. ఒక కార్బన్ కీప్యాడ్ మొబైల్ ఫోన్
ఈ సంచలన కేసును అత్యంత సమర్థవంతంగా ఛేదించిన బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య, బీర్కూర్ ఎస్ఐ రాములు,పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు దర్యాప్తులో పాల్గొన్న పిట్లం ఏస్సై ఆంజనేయులు లను జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, అభినందించినట్లు బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి తెలిపారు.

# మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత: సర్పంచ్

**మద్నూర్/జూలై 20/(జన సంఘర్షణ)**



మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యతని, చెట్లు పెంచుదాం పర్యావరణం కాపాడుదాం అంటూ సర్పంచ్ విశాలాక్షి రాం పటేల్ గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని పెద్ద షకర్గా గ్రామంలో సర్పంచ్ విశాలాక్షి రామ్ పటేల్ ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ పాలకవర్గం సభ్యులు గ్రామస్తులు కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నాటిన మొక్కను పరిరక్షించాలని, చెట్లు పెంచడం పర్యావరణం కాపాడుదామన్నారు. ఈ కార్యక్రమంలో సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయ టెంపుల్ మాజీ చైర్మన్ రామ్ పటేల్, గ్రామ కార్యదర్శి లక్ష్మణ్, పంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం



**హైదరాబాద్/ జూలై 20/( జన సంఘర్షణ)**
శిక్షణ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం పాల్పడ్డారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రికి తరలించారు. ఎస్ఆర్ నగర్ లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఇలా చేసినట్లు తెలుస్తోంది. శిక్షణ ఐపీఎస్ఐపీఎస్ ట్రైనీపై లైంగిక వేధింపులు.. పోలీసుల కేసు నమోదు హైదరాబాద్లోని జాతీయ పోలీసు అకాడమీలో ఓ మహిళా ఐపీఎస్ ట్రైనీ, తోటి.ట్రైనీ ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధించారని ఆరోపించారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన బాధితురాలు, ఉదయ్ కృష్ణారెడ్డి అసభ్యకర మెసేజ్లు పంపి, దుర్భాషలాడుతూ, గదిలోకి తీసుకెళ్లి కత్తితో బెదిరించారని ఆరోపించారు. అంతేకాకుండా, ప్రైవేట్ వీడియోలు తీసి, తన ఫోన్ లాక్కొని ఆమె భర్తకు పంపినట్లు బాధితురాలఆరోపించింది. ఈ ఆరోపణలపై పోలీసులు ఉదయ్కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఉదయ్ కృష్ణారెడ్డి విషం తాగి ఆత్మహత్నమునకు పాల్పడ్డారు.

# అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు: ఏఓ రాజు

**మద్నూర్/జూలై 20/(జన సంఘర్షణ)**



మద్నూర్ మండలంలో ఎరువుల దుకాణాలను సోమవారం మండల వ్యవసాయ అధికారి రాజు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎరువులు అమ్మే పార్టీలైజర్ యజమానులకు హెచ్చరికలు జారీ చేస్తూ ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎరువుల యజమానులు వచ్చిన స్టాక్ ఎప్పటికప్పుడు మండల వ్యవసాయ అధికారికి తెలపాలని చెప్పారు. అలాగే వచ్చిన స్టాక్ వివరాలు రాసి పెట్టుకోవాలని సూచించారు. ముఖ్యంగా రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ఏంఆర పీ ధరలకే ఎరువులు విక్రయించాలని ఆదేశించారు. అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎరువుల ధరలు , స్టాక్ వివరాలు లేని పలు ఎరువుల దుకాణాల యజమానులులకు నోటీసులిచ్చారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందనీ, ఫెర్టిలైజర్ దుకాణాల నుండి యూరియా పొందడానికి ఇంటి నుంచే యాప్ ద్వారా బుక్ చేసుకొని రైతులు తీసుకోవచ్చునని తెలియజేశారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
మంగళవారం
21 జులై 2026

## తెలంగాణ భవన్‌కు తరలిన ఉమ్మడి కోటగిరి బీఆర్ఎస్ శ్రేణులు

కోటగిరి,/ జూలై 20 /(జన సంఘర్షణ)



నిజామాబాద్ ఉమ్మడి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని దేశాయిపేట యువ నాయకుడు మొరిల్ శ్రీనివాస రావు నేడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరనున్న సందర్భంగా ఉమ్మడి కోటగిరి మండలం నుండి బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు భారీ ఎత్తున తరలి వెళ్లారు. ఉమ్మడి కోటగిరి మండలం నుండి 60 వాహనాలలో ప్రతీ పల్లె నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తెలంగాణ భవన్ కు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు మోరే కిషన్, డాక్టర్ హకీమ్, తేళ్ల రవికుమార్, సూదం నవీన్, సమీర్, సయ్యద్ ఫారుక్, దేవేందర్, శ్రీనివాస్ గౌడ్, మోరే గౌతమ్, నజీర్, కప్ప సంతోష్, సందీప్, ఆరీఫ్, ఏజాజ్, అజ్మీర్ కిషన్, రాజు, విజయ్ తదితరులు ఉన్నారు.

## మద్నూర్ మండల రేషన్ కార్డుదారులకు కీలక సూచన

- **జూలై 31లోపు ఈ-కేవైసీ తప్పనిసరి: తహశీల్దార్ ఎండీ ముజీబ్**



మద్నూర్, జూలై 20 (జన సంఘర్షణ):
మద్నూర్ మండలంలోని రేషన్ కార్డుదారులు అందరూ ఈ నెల జూలై 31వ తేదీలోపు తప్పనిసరిగా ఈ-కేవైసీ (వ-ఖ్జ) నమోదు పూర్తి చేసుకోవాలని తహశీల్దార్ ఎండీ ముజీబ్ సూచించారు. లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో పాటు కుటుంబ సభ్యులందరినీ తీసుకుని సమీపంలోని చౌక ధరల దుకాణాన్ని సందర్శించి బయోమెట్రిక్ ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని తెలిపారు. గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేయని లబ్ధిదారులకు రేషన్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. చివరి రోజుల్లో రద్దీని నివారించేందుకు ముందుగానే ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని అన్ని రేషన్ కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోపు ఈ-కేవైసీ పూర్తి చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిరంతరం పొందాలని తహశీల్దార్ కోరారు.

## జర్నలిస్టులను తిడితే.. జరిమానా, జైలు..!



- **అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక తీర్పు**

న్యూఢిల్లీ, జూలై 20 (జన సంఘర్షణ):
భారతదేశంలోని వర్కింగ్ జర్నలిస్టులను లేదా పాత్రికేయులను బెదిరించినా, తిట్టినా, దాడి చేసినా రూ.50 వేల జరిమానా, ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించవచ్చంటూ సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించినట్లు ప్రచారం జరుగుతోంది. గురువారం ఓ కేసు విచారణ సందర్భంగా ఈ అంశంపై కోర్టు వ్యాఖ్యానించినట్లు పేర్కొంటున్నారు. ఈ తీర్పుతో జర్నలిస్టులు తమ వృత్తిపరమైన బాధ్యతలను ఎలాంటి భయాందోళన లేకుండా నిర్వహిస్తూ ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించే అవకాశం ఉంటుందని జర్నలిస్టు సంఘాల నాయకులు, సీనియర్ పాత్రికేయులు అభిప్రాయపడుతున్నారు. ఈ తీర్పును వారు స్వాగతిస్తూ, జర్నలిస్టుల రక్షణకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే రాజకీయ నాయకుల నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లు, బెదిరింపుల నేపథ్యంలో ఈ తీర్పు రక్షణగా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ ప్రతినిధి / జూలై 20 / (జనసంఘర్షణ)





బాన్సువాడ మాతా-శిశు ఆరోగ్య కేంద్రంలో ఇటీవల నిర్వహించిన కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల అనంతరం అస్వస్థతకు గురైన బాధితులను ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. శస్త్రచికిత్సల అనంతరం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మొదట బాధితులను నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ మెరుగైన వైద్యం అవసరమని వైద్యులు సూచించడంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న హుమెరా ఫాతిమా (ఎల్లారెడ్డి), లిరుక్సనా (కొత్తబాది, బాన్సువాడ)లితో పాటు ఇతర బాధితుల ఆరోగ్య పరిస్థితిని పోచారం శ్రీనివాస్ రెడ్డి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అత్యుత్తమ వైద్యం అందించాలని, వారి ఆరోగ్యంపై నిరంతరం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులకు సూచించారు. బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఆయన, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన చికిత్సలో ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాధితుల కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వచ్చి పరామర్శించి ధైర్యం చెప్పిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ప్రముఖ వ్యాపారవేత్త శ్రీనివాస్

- **"బాన్సువాడలో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తాం"**

బాన్సువాడ / జూలై 20 / (జనసంఘర్షణ)




కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకూ బలోపేతమవుతోందని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాజిరెడ్డి గోవర్ధన్ చేపడుతున్న పార్టీ బలోపేత కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తుండగా, ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు వరుసగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ఈ క్రమంలో బాన్సువాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకుని బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొని కొత్తగా చేరిన వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. బాన్సువాడ అభివృద్ధి, తెలంగాణ ఆత్మగౌరవ పరిరక్షణ కోసం బీఆర్ఎస్‌తో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండా ఎగరేలా కృషి చేస్తామని అన్నారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ..శ్రీనివాస్ వంటి ప్రముఖులు బీఆర్ఎస్‌లో చేరడం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని, రానున్న రోజుల్లో బాన్సువాడలో భారీ ఎత్తున చేరికలు కొనసాగనున్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

## చలో అంకాపూర్ ఎమ్మెల్యే ఇల్లు ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు

- **అడ్డుకున్న పోలీసులు..**
- **నిర్బంధంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి**
- **కాంగ్రెస్ శ్రేణులకు దీటుగా భాజపా శ్రేణులు**
- **పరిస్థితి ఉద్రిక్తత**
- **ఎమ్మెల్యే ఇంటి వద్ద భారీగా పోలీసు బలగాలు**

నిజామాబాద్ బ్యూరో /జూలై 20/(జన సంఘర్షణ)








నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ భాజపా ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఎన్నికల సమయంలో, ప్రభుత్వం నిరుపేదలకు ఇల్లు ఇవ్వకుంటే తానే ప్రతి గ్రామంలో 10 నుంచి 15 ఇల్లు తన సొంత ఖర్చులతో నిర్మించి ఇస్తారని హామీ ఇచ్చి ఇప్పటివరకు నెరవేర్చినందుకు నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ సోమవారం చలో ఎమ్మెల్యే ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టింది. ఆర్మూర్ ప్రాంతం నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చలో ఎమ్మెల్యే ముట్టడికి తరలివచ్చారు. ముందు జాగ్రత్తగా ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు తరలి రావడంతో వీరికి దీటుగా భాజపా శ్రేణులు కర్రలను పట్టుకొని రంగలోకి దిగారు. ఒకేసారి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఇరు వర్గాలను సముదాయించడానికి పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. కాంగ్రెస్ శ్రేణులు ఎక్కడికక్కడ అడ్డుకొని వారిని పోలీస్ స్టేషన్లకు తరలించారు. గృహ నిర్బంధంలో ఉన్న రాకేష్ రెడ్డి బయటకు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మూడేళ్ల కాలంలో ఏమి చేసిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా తన ఇంటిపై దాడికి ముట్టడికి ప్రయత్నించడం జరిగిందని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులపై తీవ్రమండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదా? నిధులు ఇవ్వకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేస్తుందా? అంటూ ఆయన తీవ్రంగా విమర్శలకు దిగారు. మరోసారి ఇలాంటి ఘటన పునరావృతం అయితే తాము సహించేది లేదని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులకు తీవ్రంగా హెచ్చరించారు.

## పేకాట స్థావరంపై దాడి.. 9 మంది అరెస్ట్

బాల్కొండ, /జూలై 20/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని జలాల్పూర్ గ్రామ శివారులోని ఓ పామ్ ఆయిల్ తోటలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు ఆదివారం దాడి నిర్వహించారు. ఈ దాడిలో తొమ్మిది మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు బాల్కొండ ఎస్సై శైలేందర్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.64,960 నగదు, పేకముక్కలు, తొమ్మిది సెల్‌ఫోన్లు, నాలుగు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారిపై జూద నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వెల్లడించారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co